

ఆత్మహత్య చేసుకున్న రైతు దొనికెల రాజయ్య ఫొటోతో కుటుంబసభ్యులు

# పంట ఎండింది.. ప్రాణంబోయింది!

## దిక్కుతోచని స్థితిలో తనువు చాలించిన రైతు

### ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య

### 7 నెలలుగా రైతు రాజయ్య ఇంట విషాదం

తుర్కపల్లి, జనవరి 27: తెచ్చిన అప్పు తీరక.. సాగుచేసిన పంట ఎండిపోయి ఆ రైతు గుండె ఆగిపోయింది. అప్పుబారం ఎక్కువ కావడం.. పంటనష్టం వాటిల్లడంతో ఇంట్లో దూలానికి ఉరేసుకుని తనువు చాలించాడు. నిరుడు జూలైలో జరిగిన ఈ ఘటనపై ప్రభుత్వం పట్టించుకోకపోగా, కనీసం విచారణ కూడా జరపకపోవడం శోచనీయం. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దొనికెల కిష్టయ్యకు ఇద్దరు కుమారులు. వారిలో రాజయ్య మొదటివాడు. ఆయనకు భార్య లక్ష్మితోపాటు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి పేరున ఉన్న 2.20 ఎకరాల భూమిలో తన భాగానికి వచ్చిన ఒక ఎకరం 10 గుంటల భూమిని రాజయ్య సాగు చేసుకోసాగాడు. దానిపక్కనే ఉన్న మరో రైతు 5 ఎకరాల భూమిని రాజయ్య కౌలుకు తీసుకున్నాడు. ఈలోగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. కాళేశ్వరం జలాలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు బోగస్ అని, కూలిపోతుందని నీటి విడుదలను కాంగ్రెస్ సర్కార్ నిలిపేసింది. వర్షాలు లేక, గోదావరి జలాలు అందక రాజయ్య సాగు చేసిన 6.10 ఎకరకాలకు గానూ 3.20 ఎకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయింది. అంతకుముందే బ్యాంకులో లోన్ తీసుకొని ట్రాక్టర్‌ను కొనుగోలు చేయడంతోపాటు కూతురు వివాహం చేశారు. అన్నీ కలిపి మొత్తం రూ.10 లక్షల వరకు అప్పు అయింది. సాగుచేసిన పంట ఎండిపోవడం, తెచ్చిన అప్పు కట్టలేక మనస్తాపం చెంది నిరుడు జూలై 9న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆయన భార్య, ఇద్దరు కుమారులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 'కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సకాలంలో సాగునీళ్లు వచ్చేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులను పూర్తిగా మర్చిపోయింది' అని రైతు రాజయ్య భార్య లక్ష్మి ఆవేదన వ్యక్తంచేసింది.

**కూలిపనులకు పోతున్నం**

**బీఆర్ఎస్** ప్రభుత్వంలో రైతు పెట్టుబడి సకాలంలో అందేది. ప్రభుత్వం మారినంక పెట్టుబడి సాయం బందయింది. ఒకవైపు వర్షాలు పడలేదు. మరోపక్క సాగు నీళ్లు రాలేదు. వేసిన పంట ఎండిపోయింది. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఆయన పాణం ఇడిసినంక ఏం చేయాలో తోచలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు మమ్మల్ని ఆదుకోలేదు. కనీసం పరామర్శించడానికి కూడా ఎవరూ రాలేదు. కుటుంబ పోషణ ఎంతో భారమై కూలిపనులకు పోయి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నం.

**– దొనికల లక్ష్మి, రైతు రాజయ్య భార్య**

# అప్పు ముప్పయితదనుకోలే!

- మహిళా కౌలు రైతు మరణంతో విషాదం
- తల్లిదండ్రులకు ఆసరా అవుతననుకున్నది
- మెట్టినింటి నుంచి పుట్టినూరుకు వచ్చింది
- భర్తతో కలిసి 8 ఎకరాల్లో కౌలుకు సాగు
- దిగుబడులు రాక అప్పులే మిగిలిన వైనం
- 2 లక్షల అప్పు తీర్చేదారిలేక ఆత్మహత్య
- కనీసం విచారణ కూడా జరపని సర్కార్
- కష్టాల్లో భర్త, పిల్లలు, తల్లిదండ్రులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా గూడెన్‌ఘాట్ గ్రామానికి చెందిన కోలవేణి రాజయ్య, లక్ష్మి దంపతుల కూతురు సుమలత (30). 16 ఏండ్ల క్రితం మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు రిషిత్, రోషిణి కలిగారు. గూడెన్‌ఘాట్ గ్రామంలో ఉండే తల్లిండ్రులు వృద్ధులు కావడం, అనారోగ్యంతో బాధపడుతుండటంతో సుమలత నిరుడు తన భర్తను ఒప్పించి అమ్మానాన్నకు ఆసరా అవుదామని గూడెన్‌ఘాట్‌కు కుటుంబంతో వచ్చింది. ఇక్కడే 8 ఎకరాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసింది. సొంత భూమి ఏమాత్రం లేకపోవడంతో ఎకరానికి రూ.8 వేల చొప్పున కౌలుకు తీసుకొని పత్తి పంట సాగుచేశారు. దానిసాగు కోసం ఆ కుటుంబం అప్పు చేసింది. సుమారు 35 క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చింది. పెట్టుబడులు పెరగడంతోపాటు పత్తికి సరైన గిట్టుబాటు ధర రాలేదు. దీంతో సుమలత దంపతులకు రూ.2 లక్షల అప్పు మిగిలి ఉంది. ఆ అప్పులను తలుచుకొని వారు తీవ్ర మనోవేదనకు గురయ్యేవారు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం లేక, పుట్టిన ఊరు కావడంతో మనస్తాపం చెంది నిరుడు మార్చి 12న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నది. ఆమె మరణంతో పిల్లలు తల్లిలేని అనాథలు కాగా, తల్లిదండ్రులు దిక్కులేనివారయ్యారు.

వయసు మళ్లిన అమ్మానాన్నలకు ఆసరా అవుదామనుకున్నది. భర్తను ఎలాగోలా ఒప్పించింది. పుట్టింటికి పయనమై వచ్చింది. ఇక్కడే కన్నవారిని కంటికి రెప్పలా చూసుకుంటూ, కడుపున పుట్టిన వారిని సాదుకుంటూ భార్యాభర్తలు హాయిగా ఉండసాగారు. బతుకు దెరువు కోసం కౌలు వ్యవసాయం చేయాలని ఆ ఇల్లాలు నిర్ణయించుకున్నది.

ఉన్న ఊరిలో తానే ముందుకు నడిచి అప్పులు తెచ్చింది. 8 ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశారు. పంట సరిగా పండక దిగుబడి తగ్గింది. గిట్టుబాటు ధర కూడా రాలేదు. అన్నీపోను ఇంకా రూ.2 లక్షల అప్పు మిగిలే ఉన్నది. వాటిని తీర్చేదారిలేక పుట్టిన ఊరిలో మాటపడలేక పురుగుల మందు తాగి తనువు చాలించింది. ఆమె మరణంతో భర్త, పిల్లలు, కన్న తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు. ఆ కుటుంబానికి ప్రభుత్వ సాయం అందనిద్రాక్ష అయింది. మహిళా కౌలు రైతు ఆత్మహత్యపై ఈ పాలకులు కనీసం విచారణ కూడా జరపలేదు.



ఆత్మహత్య చేసుకున్న మహిళా కౌలు రైతు సుమలత తల్లిదండ్రులు, ఆమె పిల్లలు.. సుమలత (ఫైల్)

**పట్టించుకోని ప్రభుత్వం**

మహిళా కౌలురైతు సుమలత ఆత్మహత్య చేసుకొని ఏడాది కావస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. కౌలుసాగుతో అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నదన్న విషయాన్ని కూడా ప్రభుత్వం నమోదు చేసుకోలేదు. ఏ అధికారి కూడా విచారణ చేపట్టలేదు. అధికార పార్టీ నాయకులెవరూ ఆ ఇంటి దిక్కు రానేలేదు. ఎవరూ పట్టించుకోలేదని బాధిత కుటుంబం బావురుమంటున్నది. తల్లిదండ్రులకు సాయం ఉంటానని సొంతూరు వచ్చిన సుమలత.. కౌలు వ్యవసాయం చేసి అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్నదని స్థానికులు తెలిపారు. ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

**అండగా ఉంటదనుకున్నం**



ముసలోళ్లమైన మాకే మా బిడ్డ అండగా ఉంటదనుకున్నం. భర్త, పిల్లలతో కలిసి మా ఇంటి కొచ్చింది. 8 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసిన్రు. పంటపండక పూర్తిగా నష్టపోయిన్రు. 2 లక్షల దాకా అప్పు పడింది. అప్పులను తల్సుకొని బిడ్డ సుమలత ఎప్పుడూ బాధ పడుతూ తనువు తీసుకున్నది. కౌలు రైతులను ఆదుకుంటామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి మాకెలాంటి సాయం అందలేదు.

**- రాజయ్య, సుమలత తండ్రి**

# నేడు నల్లగొండకు బీఆర్ఎస్ కమిటీ

- ఏడాదిలోనే ఉమ్మడి జిల్లాలో 25 మంది రైతుల బలవన్మరణం
- బాధిత కుటుంబాలతో మాట్లాడి ఓదార్చనున్న బీఆర్ఎస్ నేతలు

యాదాద్రి భువనగిరి, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభంపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన బీఆర్ఎస్ కమిటీ నేడు నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నది. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 25 మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడడగా క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించనున్నది. బాధిత కుటుంబాలతో మాట్లాడి భరోసా ఇవ్వనున్నది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతులకు మళ్లీ పదేండ్ల కిందటి గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. కాలువల ద్వారా సాగునీరు రాక, ఎండుతున్న చెరువులు, బావులతో పంటలను కాపాడుకోలేక.. పెట్టుబడి సాయం అందక, రుణమాఫీ కాక అప్పుల బాధలతో మళ్లీ రైతులు ఆత్మహత్యల బాట పడుతున్నారు. ఇప్పటికే నల్లగొండ జిల్లాలో 18 మంది, యాదాద్రి భువనగిరిలో ఐదుగురు, సూర్యాపేటలో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యలకు గల కారణాలను రాజకీయ నిపుణులు, రైతు సంఘాల నేతలు విశ్లేషిస్తున్నారు. ప్రధానంగా యాసంగిలో రైతు భరోసా ఎగవేత, సకాలంలో పెట్టుబడి సాయం అందించకపోవడం, అరకొరగా రుణమాఫీ, గతంలో మాదిరి యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు కాళేశ్వరం జలాలు అందకపోవడం, నాగార్జునసాగర్ ఆయకట్టులో నీటి విడుదల లేకపోవడం, కరెంట్ కష్టాలు, ధాన్యం కొనుగోళ్లలో సర్కారు విఫలం తదితర అనేక కారణాలతో రైతులు ఆగమయ్యే పరిస్థితి వచ్చింది. నల్లగొండ జిల్లాలో మంగళవారం బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ పర్యటించనున్నది. పట్టణంలో జరిగే మహాధర్నాలోనూ పాల్గొననున్నది. అక్కడే రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి భరోసా ఇవ్వనున్నది. అనంతరం వివిధ ప్రాంతాల్లో రైతుల కుటుంబాలను పరామర్శించనున్నది. కర్షకుల ఆత్మహత్యలకు గల కారణాలపై అధ్యయనం చేయనున్నది. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పనున్నది.

## గ్రామాల్లోని వారే రైతు కూలీలా?

మొదటిపేజీ తరువాయి...

తీసుకునే నిర్ణయ సమాచారాన్ని పిటిషనర్‌కు తెలియజేయాలని చెప్పింది. పిటిషనర్ కూడా ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి వినతి పత్రం సమర్పించాలని సూచించింది. గ్రామాల్లో భూమిలేని రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు చెల్లించేలా ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో పథకాన్ని రూపొందించింది. దీనిని గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకే వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, పట్టణాలు, మున్సిపాలిటీల్లోని రైతు కూలీలకు అమలు చేయకపోవడం అన్యాయమని పేర్కొంటూ నారాయణపేట జిల్లాకు చెందిన రైతు గవినోళ్ల శ్రీనివాస్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఏసీజే జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం భారీ సంఖ్యలో గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసిందని, ఫలితంగా మున్సిపాలిటీల్లో ఉండే రైతు కూలీలకు తీరని అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. పథకాన్ని మున్సిపాలిటీల్లోని రైతు కూలీలకు అమలు చేయకపోవడం వివక్ష కిందకు వస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని 129 మున్సిపాలిటీల్లో 8 లక్షల మందికి పైగా కూలీలు ఉన్నారని తెలిపారు. రైతు కూలీలందరినీ ఒకేవిధంగా చూసేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వాదనల తర్వాత హైకోర్టు, రైతు కూలీలకు పథకం అమలుపై నాలుగు వారాల లోగా చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించి పిటిషన్‌పై విచారణను ముగించింది.

## రాష్ట్రంలో పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

**తగ్గిన రాత్రి చలి తీవ్రత**

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో చలి తీవ్రత కొంతమేరకు తగ్గింది. రాత్రి వేళల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా స్వల్పంగా పెరిగాయి. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా జిల్లాల్లో డబుల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే మూడు రోజులు కొన్ని జిల్లాల్లో ఉదయం సమయంలో పొగమంచు తీవ్రత ఉండనున్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాబోయే వారం రోజుల పాటు పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# నేడు నల్లగొండలో రైతు మహాధర్నా

- హాజరు కానున్న కేటీఆర్
- క్లాక్‌టవర్ వేదికగా జంగ్‌సైరన్
- ఏర్పాట్లు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేలు

నల్లగొండ, జనవరి 27: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు మహాధర్నా నిర్వహించనున్నారు. నల్లగొండలోని క్లాక్‌టవర్ వేదికగా మోగనున్న జంగ్‌సైరన్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుతోపాటు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు రైతులు సిద్ధమయ్యారు. ధర్నాకు సంబంధించిన ఏర్పాట్లను బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్ సోమవారం పరిశీలించారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే మహాధర్నాను నిర్వహించాల్సి ఉంటుంది.



రైతు మహాధర్నా ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్, నేత నర్సింహారెడ్డి

ఈ ధర్నాలో జిల్లాలోని రైతులకు చేయాల్సిన రుణమాఫీ, చేసిన రుణమాఫీ, ఇంకా చేయాల్సిన రుణామాఫీతోపాటు రైతుభరోసా కింద మూడు విడతల్లో అందించాల్సిన పెట్టుబడి సహాయంపై ప్రభుత్వాన్ని నిలదీయనున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ పూర్తి చేయకపోవడం, రైతుభరోసాను మూడు సీజన్లుగా పెండింగ్‌లో పెట్టడాన్ని నిరసిస్తూ జనవరి 12న నల్లగొండ క్లాక్ టవర్ వేదికగా సభ నిర్వహించేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పలు ఇబ్బందులు ఉంటాయన్న పోలీసుల సూచన మేరకు వాయిదా వేసి 21న నిర్వహించతలపెట్టింది. అయితే, ధర్నాకు ప్రభుత్వ ఒత్తిడితో పోలీసులు అనుమతులు నిరాకరించారు. దీనిని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 26న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది.



సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అనంతారం పీఏసీఎస్ వద్ద యూరియా కోసం చెప్పులు క్యూలో పెట్టి నిల్చున్న రైతులు



సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పొనుగోడులో యూరియా కోసం క్యూలైన్‌లో రైతులు

# యూరియా కోసం క్యూలో చెప్పులు

## అనంతారంలో బారులుదీరిన రైతులు

పెన్‌పహాడ్ /గరిడేపల్లి, జనవరి 27 : యూరియా కోసం రైతులు బారులుదీరుతున్న దృశ్యాలు మళ్లీ కనిపిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో క్యూలైన్‌లో చెప్పులు పెట్టి ఎదురుచూసిన ఘటనలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పునరావృతమవుతున్నాయి. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అనంతారంలోనూ సోమవారం అలాగే జరిగింది. కొద్దిరోజులుగా యూరియా కొరత ఉండగా అనంతారం (నారాయణగూడెం) పీఏసీఎస్ కార్యాలయానికి యూరియా లారీ వచ్చిందని తెలవడంతో రైతులు ఆదివారం రాత్రి నుంచే పెద్ద ఎత్తున లైన్‌లో నిలబడ్డారు. యూరియా కోసం మండలంలోని చుట్టుపక్క గ్రామాలైన పొట్లపహాడ్, అనంతారం, అనాజిపురం, మహ్మదాపురం, దోసపహాడ్ గ్రామాలకు చెందిన సుమారు 200 మందికిపైగా రైతులు నిలబడే ఓపిక లేక చెప్పులను క్యూలైన్లో పెట్టారు. పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏనాడూ యూరియా కొరత రాలేదని, ఇలా ఎప్పుడూ అవస్థలు పడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ రైతులకు సాగునీరు, ఎరువులు, విత్తనాలు, కరెంట్ సరిపడా అందించారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఎరువుల కోసం గంటల తరబడి పడిగాపుల కాయాల్సిన దుస్థితి వచ్చిందని, పొద్దునే వస్తే మధ్యాహ్నం వరకు కూడా సిబ్బంది రాకపోవడంతో తలుపులు తెరుచుకోలేదని రైతులు అసహనానికి గురయ్యారు. అధికారులు స్పందించి సరిపడా ఎరువులు అందుబాటులోకి తేవాలని రైతులు డిమాండ్ చేశారు.

**పొనుగోడులోనూ బారులే..**

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలో పీఏసీఎస్ కార్యాలయం ముందు యూరియా కోసం రైతులు తెల్లవారు జాము నుంచి పెద్ద ఎత్తున లైన్లలో నిలబడ్డారు. గ్రామానికి చెందిన దాదాపు 200 మందికిపైగా రైతులు సోమవారం ఉదయాన్నే క్యూలో నిలబడ్డారు. వీరిలో వృద్ధులు, మహిళలు కూడా ఉన్నారు. కాంగ్రెస్ పాలనలో గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు రైతులు ఆవేదన వ్యకం చేశారు.

## లోకం పోకడ




ఇంట్లో ఉన్న కోడిగుడ్లు, టమాటలు తీసుకెళ్లి నువ్వు చేసిన నిర్వాకం ఏడిచినట్టే ఉంది గానీ.. ఈ పచ్చిపులుసు, పచ్చడి మెతుకుల్తో సర్దుకో!



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు దయానంద్ (ఎమ్మెల్యే రాగమయి భర్త)

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భర్త భూమిపూజ

**అధికారుల సమక్షంలో దయానంద్ శంకుస్థాపన**

**విస్తుపోయిన సత్తుపల్లి పట్టణ ప్రజలు**

సత్తుపల్లి టౌన్, జనవరి 27: ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఎమ్మెల్యే భర్త అధికారం చెలాయిస్తున్నారు. కాంగ్రెస్ తరఫున మట్టా రాగమయి ఎమ్మెల్యేగా గెలుపొందగా ఆమె భర్త దయానంద్ షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నాడంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. సత్తుపల్లిలో తాగునీటి సరఫరా కోసం అమృత్ 2.0 పథకం పనులను మున్సిపల్ అధికారులు చేపట్టారు. సోమవారం ఈ పనులకు ఎమ్మెల్యే మట్టా రాగమయి భూమిపూజ చేయాల్సి ఉండగా.. ఆమె రాకపోవడంతో రాగమయి భర్త, కాంగ్రెస్ నాయకుడు దయానంద్ చేపట్టాడు. ఈ తతంగాన్ని గమనించిన సత్తుపల్లి ప్రజలు ముక్కున వేలేసుకున్నారు.



శామగడ్డతండాలో ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ గాంధీనాయక్ (ఇన్‌సెట్) రాములు నాయక్

## పేలుడు శబ్దానికి ఆగిన రైతు గుండె

**రిజర్వాయర్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం**

**శామగడ్డతండాలో గిరిజనుల ఆందోళన**

నవాబ్‌పేట, జనవరి 27 : భారీ పేలుడు శబ్దానికి గిరిజన రైతు గుండె ఆగింది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కారుకొండ గ్రామపంచాయతీ శామగడ్డతండాలో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు, తండావాసుల కథనం మేరకు.. శ్యామగడ్డతండా శివారులోని ఉదండాపూర్ రిజర్వాయర్‌లో కొంతకాలంగా కాంట్రాక్టర్ పెద్ద పెద్ద రాళ్లను తొలగించే క్రమంలో బ్లాస్టింగ్ పెట్టించాడు. సోమవారం బ్లాస్టింగ్ శబ్దానికి రాములునాయక్ (62)కు గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. రాములు నాయక్ మృతికి రిజర్వాయర్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటూ.. తండావాసులు, అతడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రానికి తీసుకెళ్లి ధర్నా చేసేందుకు తండావాసులు ప్రయత్నించగా విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీనాయక్, నవాబ్‌పేట ఎస్సై విక్రమ్ వారితో ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

## రాత్రివేళ సినిమాలకు మైనర్లను అనుమతించవద్దు

**అభిప్రాయపడిన రాష్ట్ర హైకోర్టు**

**ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని సూచన**

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): సినిమా థియేటర్లకు ఉదయం 11 గంటల్లోపు, రాత్రి 11 గంటల తర్వాత 16 ఏండ్లలోపు పిల్లలను సినిమాలకు అనుమతించొద్దని హైకోర్టు అభిప్రాయపడింది. దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని హోం శాఖకు సూచించింది. అన్ని వర్గాలతో ప్రభుత్వం చర్చలు జరిపి చట్ట ప్రకారం నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. గేమ్‌చేంజర్ సినిమా టికెట్ ధరల పెంపును, అదనపు షోలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై సోమవారం విచారణ జరిపిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి పైవిధంగా ఉత్తర్వులు జారీచేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది విజయ్ గోపాల్ వాదిస్తూ, ప్రభుత్వం బెనిఫిట్ షోలకు అనుమతించరాదని 11న ఉత్తర్వులిచ్చిందని చెప్పారు. సినిమాటోగ్రఫీ రూల్స్ ప్రకారం ఉదయం 8.40లోపు, తెల్లవారు జామున 1.30 తర్వాత సినిమాలను ప్రదర్శించరాదని తెలిపారు. మల్టీప్లెక్స్‌ల్లో ఆఖరాట అర్ధరాత్రి 1.30 గంటలకు ఉంటుందన్నారు. ఆ సమయంలో సినిమాకొచ్చే మైనర్ల ఆరోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పుష్ప-2 ప్రదర్శన సమయంలో జరిగిన తొక్కిసలాటలో మహిళ మరణించిందని గుర్తు చేశారు. వాదనల తర్వాత హైకోర్టు, ప్రతివాదులైన హోం శాఖ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఫిలిం టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నోటీసులు ఇచ్చింది. విచారణను ఫిబ్రవరి 22కు వాయిదా వేసింది.